# ప్రగతి శీల మహిళా సమ్మేళనం



**సిరి న్యూస్‌టుడే, నాగారం:**
మహిళా దినోత్సవం సందర్భంగా జయచంద్ర రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన తెలంగాణ ప్రగతిశీల మహిళా సమ్మేళనంలో ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ఆయన సతీమణి కమలతో కలిసి పాల్గొన్నారు. మల్కాజ్గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల మహిళలతో నాగోల్ డివిజన్ పరిధిలోని పీ.ఎం.ఆర్.గార్డెన్స్ నందు మహిళ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డిలు మాట్లాడుతూ మహిళల స్వావలంబన, సాధికారత కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు పురుషులతో పాటు సమానంగా రాణిస్తున్నారని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఒక్క రోజే మహిళల రోజు కాదని, ప్రతి రోజు మహిళా రోజేనని, భగవంతుడు అంతటా ఉండలేక తన రూపంలో మహిళను సృష్టించాడన్నారు. మహిళ కుటుంబంలో, సమాజంలో అన్ని రకాలుగా వివిధ స్థాయిల్లో తన పాత్ర పోషిస్తుందని, మహిళలు సాధించిన అభివృద్ధి, వికాసం కొలమానంగానే సమాజం సాధించిన మహిళల రక్షణ, పోషణ కోసం అత్యధిక ప్రాధాన్యత ఇవ్వడం ద్వారానే వారి అభివృద్ధి సాధ్యం అని అన్నారు. తల్లిదండ్రుల నుంచే ముందు ఆడపిల్ల గురించి ఆలోచనల్లో మార్పు రావాలన్నారు. మహిళలకు తోడుగా మనమంతా కలిసి పని చేయాలని, ప్రతి విద్యార్థి వారి అమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలని, అమ్మ, అమ్మమ్మకు మించిన వారు సమాజంలో ఇంకెవరు లేరని అన్నారు. మహిళలు అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారని, అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని అన్నారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని పలు విభాగాల్లో ఉన్నత పదవుల్లో ఉన్న మహిళలను ఘనంగా సన్మానించారు. ఇట్టి కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని పలు విభాగాల్లో ఉన్నత పదవుల్లో మహిళలు, పలు డివిజన్ల మహిళా అధ్యక్షురాళ్ళు, పలు విభాగాల కమిటీ సభ్యులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఇంటింటా హోలీ సందడి

**సిరి న్యూస్‌టుడే, హైదరాబాద్(మార్చి 03):**
ఎల్‌బీ నగర్‌లో హోలీ సంబరాలు ఉత్సాహంగా సాగాయి. పెద్దలు , పిల్లలు రంగుల హోలీని సందడిగా జరుపుకున్నారు. వాటర్ గన్‌లతో పిల్లలు సంతోషంగా ఇలా పోజిచ్చారు. స్థానిక శివగంగా కాలనీలో కనిపించిన దృశ్యం ఇది. అనుబంధాలు, భావోద్వేగాలతో, స్నేహం, సౌభ్రాతృత్వంతో, కుటుంబ విలువలను మరింత బలపరిచేలా, రంగుల సందడితో ఎల్‌బీ నగర్ తడిసి ముద్దయింది.





# నాగులపల్లి లో కాముని దహనం

**సిరి న్యూస్‌టుడే, రంగారెడ్డి జిల్లా బ్యూరో:**
హోలీ పండుగ సందర్భంగా నాగులపల్లి గ్రామంలో సోమవారం అంగరంగ వైభవంగా కాముని దహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పెద్దలు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, నూతన పాలక మండలి నాయకులు,మాజీ సర్పంచ్ లు ,మాజీ ఉప సర్పంచ్ లు, మాజీ వార్డు సభ్యులు, మహిళలు,గ్రామ యువకులు ప్రతీ ఒక్కరూ పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని తాము ఇచ్చిన పిలుపు మేరకు అందరూ కలిసికట్టుగా రావడం కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ఎంతో ఆనందకరమని నాగులపల్లి గ్రామ సర్పంచ్ నాల్లపురం రాధిక అశోక్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,అన్ని పార్టీల సీనియర్ నాయకులు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, మాజీ వార్డు సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలకు కొమ్ముకాస్తున్న ఎంఈఓ

**సిరి న్యూస్‌టుడే, రంగారెడ్డి జిల్లా బ్యూరో:**
రంగారెడ్డి జిల్లా ,జిల్లెడ్ చౌదరిగూడ మండల విద్యాశాఖ అధికారి కిరణ్ కుమార్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరుపై ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంటే, బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎంఈఓ ప్రైవేట్ పాఠశాలల ప్రచారకర్తగా మారడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ఇటీవల ఒక ప్రైవేట్ పాఠశాల వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను ఎంఈఓ తన వ్యక్తిగత వాట్సాప్ స్టేటస్‌లో పెట్టుకోవడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఆకాష్ నాయక్ స్పందిస్తూ.. "ఒకవైపు సర్కారు బడులను కాపాడుకోవాలని ప్రజల్లో అవగాహన కల్పిస్తుంటే, మండల విద్యాశాఖ అధికారి స్వయంగా ప్రైవేట్ పాఠశాల కార్యక్రమాలను ప్రమోట్ చేయడం ద్వారా ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారు?" అని ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ, ప్రైవేట్ పాఠశాలలకు కొమ్ముకాస్తున్న ఎంఈఓ తీరుపై ఉన్నతాధికారులు స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారి అయి ఉండి ప్రైవేట్ విద్యా సంస్థల పట్ల ఇంతటి ప్రేమ చూపించడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటో స్పష్టం చేయాలని, ఇలాంటి చర్యలు విద్యాశాఖ పట్ల సామాన్య ప్రజలకున్న నమ్మకాన్ని సడలిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఈఓ తీరు పై తక్షణమే వివరణ కోరాలని విద్యాశాఖ అధికారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.





# ఎల్వోసీ అందజేసిన ఎమ్మెల్యే గాంధీ

**సిరి న్యూస్‌టుడే, రంగారెడ్డి జిల్లా బ్యూరో:**
కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్ నగర్ కు చెందిన షమిమ్ బేగం అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసు కోగా ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన మూడు లక్షల ఇరవై ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన మంజూరి పత్రాన్ని బాధిత కుటుంబానికి పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అందచేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని , ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు . అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా.. సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని ఈ సందర్భంగా తెలియచేశారు. ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన గాంధీ కి బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# సర్ మౌంట్ స్కూల్ వార్షికోత్సవం

**సిరి న్యూస్‌టుడే, నాగారం:**
ఉప్పల్ బొమ్మక్ బాలయ్య గార్డెన్స్ లో సర్ మౌంట్ హై స్కూల్ వార్షికోత్సవం ఆనందోత్సహాల మధ్య ఘనంగా నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమాన్ని కరస్పాండెంట్ విజయేందర్ రెడ్డి, ప్రిన్సిపల్ చైతన్య మురళి, శ్రావ్యలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి హాజరయి మాట్లాడుతూ, "పాఠశాల పిల్లల యొక్క సృజనాత్మకతను ప్రోత్సహించే వేదికగా వార్షికోత్సవం నిలుస్తుందన్నారు. ప్రతి కార్యక్రమం విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తుందని, వారిలో నాణ్యమైన మానవీయ విలువలను పెంపొందిస్తుందని. వారి అభ్యున్నతి కోసం ఇటువంటి కార్యక్రమాలు జరగడం ఎంతో అవసరం అన్నారు. విద్యార్థులు నిర్వహించిన నాట్యం, పాటలు, డ్రామాలు సభికులను అలరించాయి. కార్యక్రమంలో సర్ మౌంట్ స్కూల్ ఉపాధ్యాయులు చైతన్య, మురళి, ధన్, సాగర్, సల్ల ప్రభాకర్ రెడ్డి, రాజు, శ్రీనివాస్ సందీప్, స్థానికులు, టీచర్లు, విద్యార్థులు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

# యువతి ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది

**సిరి న్యూస్‌టుడే, నాగారం:**
కీసర కుందన్ పల్లి రామలింగేశ్వర కాలానికి చెందిన బింగి చంద్రిక (22) ఆత్మహత్య యత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. బింగి బాలాజీ కూతురు అయిన చంద్రిక తన చిన్ని ( పిన్నమ్మ) కుమారుడు ప్రవీణ్ మృతిని తట్టుకోలేక ఆత్మహత్య యత్నానికి పాల్పడిన సంఘటన కుందన పల్లి గ్రామంలో కలకలంరేపింది. రెండు రోజుల క్రితం తన చిన్ని కుమారుడు ప్రవీణ్ అర్థిక బారంతో ఉరి వేసుకొని మృతి చెందిన ఘటన కీసర మండలం రాంపల్లీ దాయర గ్రామంలో జరుగగా, తన తమ్ముడు ప్రవీణ్ మృతిని తట్టుకోలేక మనస్తాపానికి గురైన చంద్రిక ఈ రోజు ఉదయం 11 గంటల సమయంలో తన ఇంటి వద్ద ఆత్మహత్య యత్నానికి పాల్పడిందని కుటుంబ సభ్యులు తెలిపారు, చంద్రిక ఇంట్లో ఎవరూ లేని సమయంలో మొదటగా హార్పిక్ బాత్రూమ్ క్లీనర్ తాగి అలా చావును అనుకొని తన ఇంటి బిల్డింగ్ పై నుండి దూకి ఆత్మహత్య యత్నానికి పాల్పడింది, బిల్డింగ్ పై నుండి దూకడంతో స్పృహ కోల్పోయిన యువతిని చూసిన స్థానికులు 108 కు సమాచారం అందించారు, సమాచారం అందుకున్న కీసర 108 సిబ్బంది అపస్మారక స్థితిలో పడి ఉన్న యువతిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చంద్రికను కాపాడిన 108 సిబ్బంది కి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు





# కుషాయిగూడ లో 60 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహం

**సిరి న్యూస్‌టుడే, నాగారం:**
కుషాయిగూడ గ్రామ ప్రజలు ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న 60 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహా నిర్మాణాన్ని బజరంగ్ దల్ జాతీయ అధ్యక్షుడు కిషన్ ప్రజాపతి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనను నిర్మాణ కమిటీ గౌరవ ప్రదంగా సత్కరించింది. ఈ మహత్తర కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి కుషాయిగూడ డివిజన్ అధ్యక్షులు చల్లా ప్రభాకర్ తో పాటు జనసేన ముఖ్య నాయకులతో కలిసి కే శివకార్తీక్ నాయుడు, కుషాయిగూడ డివిజన్ ఐ నాగరాజు, వై శివ, చర్లపల్లి డివిజన్ ఎస్ వెంకట రమేష్, దమ్మాయిగూడ డివిజన్ వి శివశంకర్, ఎం వెంకటేష్, సత్య రావు తదితరులు పాల్గొన్నారు.



# మల్లాపూర్ ఓల్డ్ విలేజ్‌లో బస్తీబాట

**సిరి న్యూస్‌టుడే, నాగారం:**
బస్తీబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మల్లాపూర్ ఓల్డ్ విలేజ్‌లో కాంగ్రెస్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పనులను కూడా అతి త్వరలోనే పూర్తి చేస్తామని బస్తీ వాసులకు నెమలి అనిల్ కుమార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ప్రభాకర్ గౌడ్, శంకర్ గౌడ్, గణేష్ గౌడ్, శేఖర్ గౌడ్, శ్రీకాంత్, అనిల్, భరత్, మల్లాపూర్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ తండ్రా శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు మక్తాల బాలరాజ్ గౌడ్, సురేష్ గౌడ్ పాల్గొన్నారు.



# కాంగ్రెస్ శిక్షణ శిబిరంలో అగ్రనేతలతో భేటీ

**సిరి న్యూస్‌టుడే, కర్నూలు బ్యూరో:**
"సంఘటన్ సృజన్ అభియాన్"లో భాగంగా అనంతగిరి హిల్స్‌లో ఫిబ్రవరి 21 నుండి మార్చి 2, 2026 వరకు నిర్వహించిన తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల రాజకీయ శిక్షణ శిబిరం విజయవంతంగా ముగిసిందని కర్నూలు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బోయ క్రాంతినాయుడు అన్నారు. శిబిరం చివరి రోజున రాహుల్ గాంధీ , ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వై ఎస్ షర్మిల రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు . ముందుగా డీసీసీ అధ్యక్షుల కుటుంబ సభ్యులతో కలిసి ఫోటో దిగిన అనంతరం, శిక్షణ శిబిరంలో పాల్గొని గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసే విధానాలపై సమగ్ర దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా బూత్ స్థాయి నిర్మాణం, కార్యాచరణలో క్రమశిక్షణ, ప్రజల సమస్యలపై సత్వర స్పందన వంటి అంశాలపై శ్రీ రాహుల్ గాంధీ స్పష్టమైన మార్గదర్శకత్వం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణలో భాగంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీలను పార్లమెంట్‌లో బలంగా ప్రస్తావించాలని రాష్ట్రం నుండి నాయకులకు అవకాశం ఇవ్వాలి అని విభజన హామీలు మేనిఫెస్టో లో ఉంచిన హామీల మీద పార్లమెంట్ లో చర్చ అవసరం అని రాహుల్ గాంధీ తో డిసిసి అధ్యక్షుల సమెవశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరుపున మాట్లాడే అవకాశం కలిగింది అని క్రాంతి నాయుడు అన్నారు. ఈ సందర్భాన్ని వ్యక్తిగతంగా ఎంతో ప్రేరణాత్మకంగా అనిపించింది. శ్రీ రాహుల్ గాంధీ తో గడిపిన క్షణాలు నాయకత్వంలో ఉన్న నిజాయితీ, వినయం, ప్రజల పట్ల ఉన్న కట్టుబాటు సేవా భావాన్ని స్పష్టంగా తెలియజేశాయి. ఆయన మాటలో, చూపులో ప్రతిబింబించే నిస్వార్థ భావం ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు ఆదర్శప్రాయమైంది అని అన్నారు. పార్టీ బలోపేతం, గ్రామ స్థాయి నుంచి ప్రజా ఉద్యమాలను శక్తివంతం చేయడం, రాష్ట్ర హక్కుల సాధనలో సమిష్టి కృషి చేయడం ముఖ్య లక్ష్యంగా ముందుకు సాగుతామని తెలియజేశారు.

# ఉప్పల్ భగాయత్ అభివృద్ధికి నిధులు మంజూరు

**సిరి న్యూస్‌టుడే, నాగారం:**
ఉప్పల్ భగాయత్ హెచ్‌ఎండీఏ లే అవుట్ లో వివిధ రకాల అభివృద్ధి పనులకు నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంజూరు చేసినట్లు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఉప్పల్ భగాయత్ ప్రత్యేక అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా పనులను చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.3 కోట్ల 50 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు. 9 కోట్ల 80 లక్షలతో రోడ్ల నిర్మాణ పనులకు సిఎం రేవంత్ రెడ్డి మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు.



# వెంకులోని గుట్ట పై పౌర్ణమి వేడుకలు

**సిరి న్యూస్‌టుడే, నాగారం:**
రాంపల్లి దాయర వెంకులోని గుట్ట పై వెలసిన హేమాద్రి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పాల్గుణ పౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు పల్లకి సేవ, గిరి ప్రదక్షణ, లక్ష్మీ పూజ నిర్వహించారు. సోమవారం రాత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చేమకూర మల్లారెడ్డి, ఆలయ చైర్మన్, పూజారులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# దేవాలయాల మూసివేత

**సిరి న్యూస్‌టుడే, కర్నూలు బ్యూరో :**
ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పలు దేవాలయాలు సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మంగళవారం ఉదయం నుంచి మూసివేశారు. ప్రధానంగా శ్రీశైలం ,మహానంది, యాగంటి, అహోబిలం, మంత్రాలయం తదితర క్షేత్రాలలోని ఆలయాలను మూసివేశారు. బుధవారం తెల్లవారుజామున ఈ ఆలయాలను శుద్ధిచేసి భక్తులు దర్శించుకునేందుకు దేవదాయ శాఖ అధికారులు ఏర్పాటు సిద్ధం చేశారు.



# పటికతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు

పటిక అందరికీ తెలిసే ఉంటుంది. ఎంత మురికి నీటిలో అయినా పటికను వేసి కాసేపు ఉంచితే మురికి, మట్టి అంతా కిందకు పోయి తెల్లటి, శుభ్రమైన నీరు పైకి వస్తుంది. అంతటి శక్తివంతమైన శుద్ధి లక్షణాలు కలిగినది పటిక. ఆయుర్వేదంలో పటికకు చాలా ప్రాముఖ్యత ఉంటుంది. ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్, యాంట్ ఫంగల్ లక్షణాలు అనేక రకాల సమస్యలకు పరిష్కారం చూపించగలుగుతాయి. సాధారణంగా పూజలు, పరిహారాల్లో ఉపయెగించే దీంతో చాలా రకాల ఆరోగ్య ప్రయోజనాలున్నాయని మీకు తెలుసా. అవును ఇది అందం, ఆరోగ్యంతో పాటు అనేక సమస్యలకు చక్కటి పరిష్కాలను చూపిస్తుంది. అవేంటో ఎలా ఉపయోగించాలో తెలుసుకుందాం రండి. పటిక నీటితో స్నానం చేయడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. పటిక నీటిలోని మలినాలను శుభ్రపరుస్తుంది. యాంటీ బాక్టీరియల్, యాంటీ సెప్టిక్ లక్షణాలను కలిగి ఉన్న ఇది చర్మాన్ని ఆరోగ్యంగా మారుస్తుంది. చర్మ ఇన్ఫెక్షన్ సమస్యలు ఉన్నవారికి పటిక నీరు ఒక దివ్యౌషధం లాంటిది. దీనిని నీటిలో కలిపి స్నానం చేయడం ద్వారా చర్మంపై ఉన్న బ్యాక్టీరియా తొలగిపోతుంది. బొబ్బలు, దురద,దుర్వాసన నుండి ఉపశమనం ఇస్తుంది. ఇక.. చాలా మంది పటికను నీటిలో కలిపి ముఖానికి రాసుకుంటారు. అయితే పటిక , రోజ్ వాటర్ అనేక చర్మ సమస్యల నుండి బయటపడటానికి ఉత్తమ ఎంపికలలో ఒకటి. రోజ్ వాటర్‌లో పటికను కలిపి రాసుకుంటే ముఖంపై ఉండే అనేక సమస్యలు తొలగిపోతాయి. దీని కోసం మీరు ముందుగా పటిక పొడిని తయారు చేయాలి. ఇప్పుడు ఒక టీస్పూన్ పటిక పొడిని తీసుకుని అందులో రోజ్ వాటర్ కలపాలి. తర్వాత ఈ పేస్ట్‌ను మెడ, ముఖానికి అప్లై చేయాలి. ముఖంపై సున్నితంగా మసాజ్ చేయండి. తర్వాత 15 నిమిషాల తర్వాత నీళ్లతో ముఖం కడుక్కోవాలి. ఈ పేస్ట్‌ని వారానికి రెండు సార్లు అప్లై చేయాలి.ఇక ఆరోగ్యం విషయానికి వస్తే.. విపరీతమైన దగ్గు, ఆస్తమా వంటి సమస్యలతో ఇబ్బంది పడే వారు కూడా పటికతో త్వరిత ఉపశమనాన్ని పొందుతారు. ఇందుకోసం మీరు చేయాల్సిందల్లా పటిక ముక్కను తీసుకుని పొడి చేసి తేనెలో కలిపుకుని తాగాలి. ఇలా చేయడం వల్ల ఎలాంటి దగ్గు నుంచి అయినా పరిష్కారం లభిస్తుంది. అలాగే.. జలుబు, ముక్కు కారడం వంటి సమస్యలను నుంచి బయటపడేందుకు పటికను వేడి చేసుకుని పొడి చేసుకుని తర్వాత ఆ పొడిని గోరు వెచ్చటి నీటిలో కలుపుకుని తాగాలి. ఇలా రోజుకు రెండు నుంచి మూడు సార్లు తాగారంటే మీ జలుబు పరార్ అయిపోతుంది. దంతాల్లో నొప్పి, చిగుళ్లలో రక్తస్రావం వంటి అనేక రకాల దంత సమస్యలకు కూడా పటిక పరిష్కారం చూపిస్తుంది. ఇందుకోసం పటికను, ఉప్పును తీసుకునిపొడి చేసుకోవాలి. ప్రతి రోజు ఈ పొడితో దంతాలు, చిగుళ్లను శుభ్రం చేసుకోవాలి.

# ఈ ఊర్లో వాళ్లకు పేర్లుండవ్..



మీ పాపకు ఏం పేరు పెట్టారు ?. 'ఈ ' అక్షరం మీద మా బాబుకు మంచిపేరు చెప్పండి. ఇలాంటివి మాటలు వింటూ ఉంటాం. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో అయితే తమ పేరు మరింత ప్రత్యేకంగా ఉండాలని, చిత్ర విచిత్రంగా పెట్టుకుంటూ ఉండటం కూడా చూస్తూ ఉన్నాం. అయితే పుట్టిన ప్రతి మనిషికీ పేరు తప్పకుండా ఉంటుంది. ఇది మనందరికీ తెలిసిన విషమే. పిల్లలు పుట్టిన వెంటనే చిన్న, కన్న అంటూ రకరకాల ముద్దు పేర్లతో పిలుస్తాం. ఒక వ్యక్తికి గుర్తింపునిచ్చేది పేరే. అదే లేకపోతే సమాజంలో బతకగలమా.. ఇది ఊహించుకుంటేనే విచిత్రంగా ఉంది కదూ.. ఎందుకంటే, పొద్దున లేచిన దగ్గర నుంచి పడుకునే వరకూ పేరు లేని మనిషిలా జీవించడం అంత సులువు కాదు. ఇదంతా ఇప్పుడు ఎందుకు చెప్తున్నా అంటే పిల్లలకు నామకరణం చేయడాన్ని పండగలా నిర్వహించుకునే మన దేశంలో ఒక వింత గ్రామం ఉంది. ఆ గ్రామంలో నివసించే వారిలో ఎవరికీ పేరు లేదు. ఇలాంటి పల్లె ఒకటి ఉందని నమ్మడం వింతగా అనిపించినా ఇదే నిజం. అయితే ఈ గ్రామం ఎక్కడ ఉంది..? వారు పేరుకు బదులుగా ఒకరినొకరు ఎలా పిలుచుకుంటారో తెలుసుకుందాం..

మన దేశంలో ఈ ప్రత్యేకమైన గ్రామం మేఘాలయ రాష్ట్రంలో ఉంది. షిల్లాంగ్ నుండి 60 కి.మీ దూరంలో తూర్పు ఖాసీ హిల్స్ జిల్లాలో ఉంది. ఇక్కడ మరో వ్యక్తిని పిలవాలంటే ఈలలతో పిలుస్తారంటా. లేదా సైగ లతో పిలవడం లాంటివి చేస్తుంటారు. అందుకే ఈ ప్రాంతాన్ని 'విజిల్ విలేజ్' అని కూడా పిలుస్తారంటా. ఎందుకు అలా పిలుస్తారు ఎంచక్కా పేర్లతోనే పిలుచుకుంటే పోతుంది కదా అని అంటారా.. అయితే ఇక్కడ ఆసక్తికర విషయం ఏంటంటే ఆ ప్రాంతంలో ఎవరికి పేర్లు లేకపోవడం అక్కడి సాంప్రదాయం అంటా.

చిన్నప్పటినుంచీ ఎక్కడైనా ఏం నేర్పిస్తారు పదాలు పలకడం, పేర్లు పిలువడమే కదా? కానీ, ఈ ఊళ్లో మాత్రం ఈలలు కొట్టడం, శబ్దాలు చేయడం, పాటలు పాడటం నేర్చుకొంటారు.

సీటీ కొట్టడం వచ్చింది అంటే పిలగాడు ఎదిగినట్టే. రోడ్డుమీద పోతూ సీటీ కొడితే మన దగ్గర ఏమైతదో తెలుసు కదా? వీపులు విమానం మోత మోగిస్తారు.

అదే, కాంగ్‌థాన్‌లో అయితే వాళ్ల అమ్మానాయిన వచ్చి గుండెలకు హత్తుకుంటారు. ఆ సీటీల సప్పుడుతోటే వాళ్లు మనుషులను అర్థం చేసుకుంటారు. వీళ్ల పూర్వీకులు సీటీల ద్వారా ప్రత్యేక ట్యూన్లు కట్టి పిల్లలను లాలించే వారట. అట్లా తీరొక్క ట్యూన్‌లతో ఇప్పటికీ కొనసాగుతున్నది ఈ ఆచారం. మనలెక్క వాళ్లకు పేర్లు ఉండకపోవచ్చు. కానీ, మనకంటే ఎక్కువ కసరత్తే చేస్తరట. తండ్రి కొత్త సీటీ పాడి వినిపిస్తే, తల్లి ఒక శబ్దం వినిపిస్తదట. పెద్ద మనుషులంతా కలిసి అమ్మ, నాయిన ఇచ్చిన శబ్దాలను జోడించి ఫైనల్ 'ఈల' నిర్ణయిస్తరట. విచిత్రం ఏమిటంటే మన దగ్గర ఒక్కో పేరు చాలామందికి ఉంటది. కానీ, కాంగ్‌థాన్‌లో ఒకరికి కేటాయించిన శబ్దం ఎట్టి పరిస్థితుల్లోనూ మరొకరికి పెట్టరట. అదెట్ల గుర్తు పెట్టుకుంటరో ఏమో మరి?

..ఇట్లా సీటీ శబ్దాలతోటి పేర్లు పెట్టడాన్ని వారి భాషలో 'జిగవా యోబి' అంటారంటా. ఈ కాంగ్‌థాన్ ప్రజల సంప్రదాయం ఆసక్తికరంగా ఉండటంతో, ఆ గ్రామాన్ని చూడటానికి పర్యాటకులు క్యూ కడుతూ ఉంటారు. చుట్టుపక్కల ఎన్నో ఊర్లలో గిరిజనులు ఉన్నా ఒక్క కాంగ్‌థాన్ గిరిజనులు మాత్రమే ఇలా 'ఈల' శబ్దాలతో మనుషులను పిలుచుకొనే సాంప్రదాయం కొనసాగిస్తున్నారు.

